

# ఓ హృదయమా! మేలుకో!

జి. రమేష్ బాబు

లేచిన వేళ మంచిదికాదు. ఉదయంనుండి రాత్రివరకు అన్నీ అవకతవకలే. ఏవో ఆలోచనలు—ఏవో ఆశయాలు—ఎందుకో ఆరాటం—ఏమిటో పోరాటం—ఓ వైపు ఉద్వేగం! మరో వైపు ఉన్మాదం—ప్చ్. ఎందుకని. ఎందుకనలా?

తీరికలేని మెదడుకు కలిగిన ప్రశ్న. ఏమిటి దానికి సమాధానం? అసలు ప్రశ్న పుట్టేందుకు కారణం!—ఒకటా ! రెండా! ఎన్నో! ఏమిటవి !

ఉదయంనుండి సాయంత్రం వరకు జరిగిన ఎన్నోసంఘటనలు—ఎన్నో.... ఎన్నెన్నో!

ఒకదాని పిదప మరొకటి గుర్తుకొస్తున్నాయ్.

గతానికి కాళ్లు వస్తున్నాయ్.

కనిపించిన నిజాలను కళ్లు చూస్తున్నాయి.

వినిపించిన వేదనలను మనసు వింటోంది.

ఏమిటా నిజాలు!

ఎందుకా వేదనలు!

భారమైన తలకు, బరువెక్కిన గుండెకు ఓదార్పు నిట్టూర్పులోనే.

ఆలోచించే కొలదీ ఆలోచనే—

అవలోకించే కొలదీ అనుభవమే—

అనుభవపూర్వకమైనఆలోచనే జీవితం—

మరి, చూసినదంతాజీవితమేనా?

కాదు—కాకూడదు—కారాదు.

ఐతే ఏమిటి?

అదే....అదే నాకు అర్థంకావటం లేదు.

'ప్రయత్నించు'.

ఆఁ! ప్రయత్నమా!

'ఊఁ!'

ఎలాగో?

'వెనక్కు వెళ్లు. జరిగినవి చూడు. స్వగతానికి రా. ఆలోచించు. రాబోయేవి




ఊహించు. తదనుగుణ్యంగా మానవ జాతిని మేల్కొలుపు. జీవితాన్ని సరిదిద్దుకో. కాలాన్ని అధిగమించు. అనుభవించు.'

మనసు వెనక్కు వెళ్ళింది.

* * *

ఈరోజు ఉదయం ఆరుగంటల ప్రాంతంలో లక్ష్మీపాలెం వెళ్లాను. అదొక చిన్న పల్లెటూరు. ఆ ఊరికి ఆరేడు మైళ్ళదూరంలో ఓ గిరిజన కూటమిఉంది. దాన్నంతా కోయగూడెం అంటారు. అందులోని మనుషులు–ఈ ప్రపంచానికి చాలా దూరంగా ఉన్నారు. వారి బాగోగులను విచారించే నిమిత్తం రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌వెస్టిగేటర్‌గా నేను అక్కడికి వెళ్లాను.

వారిలోని అజ్ఞానాన్ని అంతరింపజేయడం నా విధి. వారి జీవనపథాలనుండి




మానసికంగా, శారీరకంగా అపరిశుభ్రతను తొలగించడం నా ధర్మం. అనైక్యత అనే అంటువ్యాధిని సమూలంగా నాశనం చేయడం నా కర్తవ్యం. వారి ఆరోగ్యాన్ని, అభ్యుదయాన్ని వాంఛించడం నా వృత్తి. వారిపై జరుపుతున్న అత్యాచారాలను, అక్రమాలను అరికట్టడం నా ధ్యేయం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలుగజేసి అభివృద్ధికరమైన ఆలోచనా సరళిని రేకెత్తింపజేసి, వారిని తాతలనాటి కాలంనుండి పీడిస్తున్న 'సాంఘిక భయం' అనే జబ్బును మాన్పడం నా ఉద్యోగం.

—ఐతే నేనెంతవరకు నా విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చ గలిగాను.

నా కళ్లెదుటే ఓ అమాయకురాలు బలైపోతుంటే ఏమీ చేయలేకపోయానే. పరిస్థితులతో పోరాడినా గెలవలేకపోయానే. స్వామ్యవాదమూ, దండోపాయమూ రెండూ ఓడిపోయాయే.

"అయ్యా! ఎరుక లేనివారు. ఏదో తప్పు సేసిండు. వాళ్ళనొగ్గెయ్. దరమ పభువులు దయసూపాల. నా మూలాన కస్టపడినారు. సెమించండి అయ్యా!"

ఆమాటలు, మరణించబోయే ముందు ఆ గిరికన్య పలికిన మాటలు, నా చుట్టే తిరుగుతున్నాయ్. నన్ను వెంటాడుతున్నాయ్. కాదు....కాదు....వేటాడుతున్నాయ్.

అయ్యో! ఎంతపాపం చేశా నీరోజు! గుండె వలవలమంది. అసలెందుకలా జరగవలసి వచ్చింది. ఆమెను చూడడం ఎందుకు తటస్థించింది. అదీ చూడరాని స్థితిలో. నా చూపే ఆమె చావుకు కారణమైతే—నాకు చూపెందుకు పోకూడదు.

హే! భగవాన్!

అజ్ఞానంతో అంధకారంతో అలమటించే అభాగ్య హృదయాల్లో వెలుగు నింపాలనుకోవడం నేరమా?

మూర్ఖపు పట్టుదలతో నిండుప్రాణాలను బలిచేస్తున్న ప్రారబ్ధహృదయాలను సరిదిద్దాలనుకోవడం నేరమా!

చీకటిలో వెలుగు నింపడమే నేరమైతే, పోయే ప్రాణాన్ని నిలబెట్టేందుకు పోరాడడమే నేరమైతే—ఇక బ్రతుకెందుకు! దానికో బంధమెందుకు? అంతా శూన్యం.

ఈ విపరీత ప్రవృత్తిని ఆపలేమని తప్పుకోవడం మానవధర్మమా?మనసున్న మనిషి చేయగలిగినదేనా! అది అతనికి ఆత్మవంచన కాదా? ఆత్మదృష్టి అతనిని నిగ్గదీయదా?

మనసు మండిపోతోంది.

కొండలవంటి కంచు గుండెలను మీటిననాడే కదా మానవుని జీవితం సార్థకమయ్యేది? నిండు మమతలున్నా అంతకన్నా లోతైన వాత్సల్యానురాగాలున్నా బండమనుషుల మొరటు ఆచారాల విషపు కోరలకు బలి అయిపోతున్న ఈ అభాగ్య గిరిజనులకు ఊరడింపు నెవరు ఇవ్వగలరు?

జడులులాగా మూఢనమ్మకాల వలయాలలో సుళ్ళుతిరుగుతున్న వీరిలోని పిచ్చి సాంఘిక భయం మానవత్వాన్ని రూపుమాపి వారిలో కసాయితనాన్ని రంగరించి పశుప్రాయులను చేస్తోంది.

వీరికి విముక్తి ఏనాటికి కలిగించాలి?

అనాగరిక, అపరిశుభ్ర, అజ్ఞాన పరిధులనుండి—

ఆగ్రహావేశాల, అపస్మారక ఉద్రేకాలనుండి—

కర్కశ పశుప్రాయ ప్రవృత్తుల నుండి—

భయంకరమైన జాతి, మత, కుల పిశాచ మూకమునుండి—

ఎప్పుడు విముక్తి?

ఏనాటికి వారిలో అభ్యుదయశక్తి!

ఎప్పుడో! ఏనాడో! ఏ కొంచెమో!

ఊఁహూ. వీల్లేదు. ఇప్పుడే. ఈనాడే.

వీరిలోని జీవన భయాలను, బాధలను తొలగించి వారు చిరునవ్వుల తేలియాడే అభయమివ్వాలి.

అదే గాంధేయం! అభ్యుదయం! సమతావేదం! హృదయానునాదం! కాని ఎంతవరకు కర్తవ్య నిర్వహణలో విజయం సాధించాను.

లేదే. ఇంతవరకు విజయం లేదే.

గిరిజనుల అమానుష ప్రవర్తన కొకసారి ఒళ్ళుహూనమై-ప్రాణంతో బైట పడ్డానే.

నా బాధంతా ప్రాణం పోతుందని

కాదు. వీరి జీవితం నాశనమైపోతోందే అనే.

నన్ను చూచి భయపడ్డాడనుకొన్నాను. అందుకే జాలిపడ్డాను. ప్రేమగా చిరునవ్వుతో అతన్ని సమీపించసాగాను. నిరాయుధునిగా ఐతే నన్ను నమ్మగలడేమో అని నా చేతిలోని రైఫిల్ పారవేశాను. ఆప్యాయంగా అతని దగ్గర కెళ్ళసాగాను.

అంతే.

సూటిగా వాడిబాణం నా గుండెలో గుచ్చుకొంది.

'అమ్మా' అంటూ కుప్పలా కూలిపోయాను. బాధతో విలవిల తన్నుకొంటున్నాను.

ఏడెనిమిదిమంది కొండజాతి నరులు-కరుణలేని రాక్షసులు—కాదు కాదు కరుణను మరచిపోయిన సోదరులు, దగా పడ్డ తోబుట్టువులు—

నా చుట్టూ చేరారు. అందరి చేతుల్లో చిరుకత్తులు.

నే చూస్తున్నాను. అందరి చూపుల్లో ఒకటే భావం.

క్షణాలు గడుస్తున్నాయి.

ఒకటి—రెండు—మూడు.

మూకుమ్మడిగా నన్నుపొడవవచ్చారు. ఆ దృశ్యాన్ని చూడలేక బాధను గుర్తుచేసుకోలేక కళ్ళు మూసుకున్నాను.

ఒక్క క్షణం గడవలేదు—

రైఫిల్ ప్రేలిన శబ్దం. మీదమీద—అతి దగ్గరగా—

అంతే.

గిరిజనులు ఉడాయించారు. పసిపిల్లల్లాగా—భయపడ్డ లేడిపిల్లల్లా పరిగెత్తారు.

వారిలోని పిరికితనానికి నాకు నవ్వొచ్చింది. జాలేసింది. నా అసిస్టెంట్స్ సమయానికి రాకపోయి ఉంటే—

అఫ్‌కోర్స్! కథ ఇంకో విధంగా మారి ఉండేది.




ఏమని!

'విధి నిర్వహణలో ఒక ఆఫీసర్ దారుణ హత్యకు గురైనాడు. అతడు గిరిజనోద్ధరణకై నడుముకట్టుకొన్న దీక్షాపరుడు. భరతమాత గర్వించ తగ్గ ఉత్తమపౌరుడు. అటువంటి మహనీయుని మానవతామూర్తిని కొండజాతివారు దయాహీనులై మృగాలవలె వేటాడారు. ఆ మహాపురుషుని ఆత్మశాంతికై మనమంతా ప్రార్థిస్తాము. అతని ఆశయాలలోనే కొనసాగుదాము. అతనినే ఆదర్శమూర్తిగా స్వీకరిస్తాము.'

అలా ఉపన్యాసాలు పరంపరలుగా వేదికపైనా, పత్రికలపైనా ఎక్కుతుంటాయి.

వాటితోపాటు—

'విధి నిర్వహణలో అసువులొడ్డిన ఆ ఉన్నత హృదయుని కుటుంబానికి ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తున్నాం. అతని కుటుంబానికి వీలైనంత సహాయం చేయవలసినదిగా ప్రజాప్రతినిధులమైన మేము ప్రభుత్వాన్ని, ప్రజలను కోరుతున్నాము'—లాంటి ముగింపు ధోరణులు ఉపన్యాసాల్లో వెలుస్తాయి.

ఆ ఆఫీసర్ కీర్తి గగనాన్ని చేరుతుంది. సంతోషకరమే.

ఆ ఆఫీసర్ కుటుంబ సభ్యులకు చేయూత ఇవ్వబడుతుంది. అదీ సంతోషకరమే.

కాని—

ఆ కొండజాతి మూర్ఖత్వాన్ని, మేల్కొల్పిన మానవత్వంతో పారద్రోలేవారే కరవౌతారు. వారి జీవితాలలాగే అడవుల్లో, కొండల్లో గడచిపోతాయి. వారు అనామకులై, చరిత్రపుటల కందకుండా పోతారు. ఈ మానవజాతిపైనే ఈర్ష్యాద్వేషాలు పెంచుకొన్నవారు—తాముకూడా మానవులమే అన్నది మరచి—మృగాలతీరులో జీవించి—శుష్కించి నశించిపోతారు. మానసికంగా కృంగిపోతారు. అదే నా బాధ. అలా జరుగకూడదు. వారుకూడా మనలాగే బ్రతికే రోజు రావాలి.

హిందూజాతి శ్రేయస్సుకోసం-అనే పంథాలో కాక - మహమ్మదీయ ప్రీతికోసం అనే దారిలో కాక- కిరస్తానీయుల భద్రతకోసం-అనే రీతిలో గాక—

కులమత ప్రాంతీయ భేదాల నధిగమించి—

జాత్యహంకార వినాశకర శక్తుల నుండి విముక్తిపొంది—

పేదరికము - పెద్దరికము - అనే వ్యత్యాస ధోరణిని అతిక్రమించి-సర్వమానవ సమానతకోసం—




శుభాభ్యుదయాసంస్కృతి కోసం—
హృదయదుంధుభి మ్రోగించాలి.
విజయభేరి పలికించాలి.

అదే నా ఆశయం. ఆదర్శం. నా జీవిత సర్వస్వం.

'మానవత్వం లోపించిన మానవ మృగాలతో మసలడం - మృత్యువుతో పోరాడడమే. అందుకే దినదిన గండమైనా - ప్రాణానికి విలువివ్వక - నా జీవితాన్ని ధారబోస్తున్నాను. నామూలాన ఎవ్వరూ బాధపడకూడదనే భావనతోనే జీవన ప్రధానధర్మమైన గృహాశ్రమ రూపాన్ని వదులుకొన్నాను. నా తల్లి దండ్రుల కేలోటూ రానీయక - అంటే నన్ను చూడడంలేదే అన్న దిగులు తప్ప నిస్తే-చూచుకొనేందుకు - మల్లన్న-అదే మాయింటి నౌకరైనా-యజమానైనా వాడే ఉన్నాడు. నా ఉద్దేశాన్ని నా తల్లి తండ్రులు గుర్తించడమే కాక గౌరవించారు. అంతకన్నా నాకు కావలసిందేముంది? అందుకే నడుం బిగించి - ఈ రంగంలోనికి దిగాను. జయమైనా-ఓటమైనా నేను సిద్ధమే. గాని ప్రయత్న లోపంమటుకు ఉండరాదు. ఉండకూడదు. ఉండనివ్వను.'

నాలో ఏదో తృప్తి కలిగింది.

'నిజమే. నా ప్రాణాపాయమైనా లెక్క-పెట్టనిమాట నిజమే. కాని ఈవాళ జరిగిందేమిటి? నామూలంగా ఓ గిరికన్య ముక్కు-పచ్చలారని ముగ్ధ ప్రథమ మరణించడమా?

ఈ పాపం నాదా? నా ఆశయానిదా? కాదు. ఐతే ఆ గిరిజనుల మూర్ఖత్వానిదా? పాపిష్టి విధిదా?

ఎవరిది ?

* * *

నా డ్రైవర్‌ను వ్యాన్‌దగ్గరే ఉండమని చెప్పి, అసిస్టెంట్‌తో - కోయగూడెం పరిసరాలను పరికిస్తున్నా.

సూర్యుడు నడినెత్తికి వచ్చాడు.

"ఆ పరిసరాలు చూస్తుంటే ప్రకృతి పరంగా పారవశ్యంగా ఉన్నా-వారిజీవన ప్రమాణపు విలువల దృష్టిలో-కొద్దిగా బాధాకరంగా ఉంది. వారి పారిశుద్ధ్య జీవనం అత్యంత ఘోరంగా ఉంది.

వారి మూర్ఖపు విధానాలు అంతకన్నా హీనంగా ఉన్నాయి.

పరిశుభ్రత వారి హృదయాల్లో ఉన్నా-మూఢనమ్మకాలు దాన్ని కప్పేసాయి. పరిణితి వారిలో ఏవిషయంలోనూ లేకపోవడం విచారకరం. వేమన ధోరణిలో ఐతే—

**'తనూశుద్ధి కన్నా చిత్తశుద్ధి అవసరం. ఆత్మశుద్ధిలేని ఆటోపాలు, అర్థంలేని ఆచారాలు-మానవజీవిత శాకాసులు.'**

కాని జీవితంలో - మరోవిధంగా మానసిక శుద్ధే కాదు శారీరక శుద్ధి కూడా కావాలి. శారీరక రుగ్మతుల బారినుండి తలదాచుకొని మానసిక వికాసంతో జీవితవిలువను పెంచుకోవాలి.

సనాతన పద్ధతులన్నీ మూఢమైనవి కావు. కాని కొన్ని అర్థంలేనివి.అపాయ కరమైనవి. యుక్తాయుక్త విచక్షణతో పరిశీలించి ఏది మంచి? ఏది చెడు? అనే జ్ఞానం మానవమాత్రులమైన మేము సాధించుకోవాలి. ఆ సాధనకే మనుగడ సంకితంచేయాలి. ఐతే—

'ఈ ఆకలింపు శక్తిలేని కొన్ని వర్గాలు-సమాజానికి దూరంగా-వెలివేసినట్లుగా-తలెత్తాయి. అవి కొన్ని విచిత్రమైన మూర్ఖపు ఆచారాలను ఏర్పరచుకొన్నాయి. ఒక విధమైన పిచ్చినమ్మకం వీరిలో నాటుకుపోయి-ఆ నమ్మకానికి ఎందరినో బలియిచ్చేలా-చేస్తోంది. వీరిని అనునయించి, దారి మళ్ళించాలని ప్రయత్నించేవారిని-కక్ష్యకట్టి చంపాలనే వారి ప్రయత్నం. ఐనా ధైర్యంతో ముందుకెళ్ళి వారిలో భయాన్ని ప్రవేశపెట్టక-మానసిక పరివర్తనను కలిగించగలిగాం. అదే సంస్కృతి, సభ్యత, చదువు, సంస్కారమున్న మన ధర్మము. కాని—

ఎవరూ వారిని పట్టించుకోవడంలేదు.

వారొకవేళ ఇక్కడికి వచ్చినా-అవమానానికి-అనుమానానికి-ఆవేదనకు-ఆక్రందనకు-గురౌతున్నారు.

ఇది భరించరానిది.

సహించి క్షమించరానిది.

అటువంటి నాగరికతా దుష్టకూటమిని ఆదిలోనే త్రుంచివేయాలి. అమాయకుల దౌర్బల్యాన్ని స్వార్థానికి వాడుకొనే దుష్టసంపుటిని నాశనం చేయాలి.

అది ప్రభుత్వకర్తవ్యమేకాదు. మన కర్తవ్యం కూడ.

కాని ఎంతవరకు ఈ విధిని మనం నిర్వహిస్తున్నాం?

ఈ ప్రశ్నే తలెత్తకూడదు. అదే దీనికి తుది మలుపు."

తను ఆలోచిస్తూ నడుస్తుండగా—

మండుటెండలో - మలమల మండుతున్న బండలపై - మెలుకువ తప్పి - కందిపోతున్న - ఓ గిరికన్య.

తను వెంటనే తన రైఫిల్ అసిస్టెంట్ కిచ్చి-ఆమెదగ్గరకు వెళ్లాడు.

కమిలిన పద్మంవలె ఉన్న ఆమె ముఖాన నీళ్ళుచల్లి-ఆమెను చెట్టునీడకు చేర్చాను—

ఇంకా కళ్ళుతెరువని ఆమె బాగా అలసిపోయినట్లుంది.ఇరవై సంవత్సరాలు మాత్రమే ఆమె జీవితంలో గడిచిఉన్నా ఓ ఐదేళ్ళు ఎక్కువ గడిచినట్లే కనిపిస్తుంది.

తనెంట తీసుకొనివచ్చిన—

గ్లూకోజ్ నీరుకలిపి-మగతగా ఉన్న ఆమెకు తాగించాను-ఐదారు నిమిషాలు గడిచిపోయాయి.

ఆమె నిస్త్రాణగా కనులు తెరిచింది. నన్ను-నా అసిస్టెంట్ ను చూచి-భయపడిపోయింది—

నేను భయపడవద్దు. మేము నిన్నేమీ చెయ్యమన్నట్లు సంజ్ఞచేశాను. ఆమె నెమ్మదిగా అంది—

'నన్నెందుకిక్కడికి తీసుకొచ్చినారయ్యా! నావారు చూస్తిరా నేను మైల పడిందానినని వెలివేస్తారు. అయ్యా! మీకు మొక్కుతాను. మీరు వెళ్ళిపోండయ్యా!'

ఆమె మాటలు - అనాగరికంగా - అసహ్యంగా లేవు. నాకెంతో ఆనందమైంది.


'ఓ కోయపిల్ల అలా మాట్లాడినందుకు'

'నీవేమీ భయపడకు. నీవారిదగ్గర నిన్నొదులుతాను.'

అని నేననేంతలో—

ఎవరో వస్తున్నట్లు చప్పుడు.

'అయ్యా! వెళ్ళిపొండయ్యా! బేగి




వెళ్ళండయ్యా! లేకపోతే నేను దూరమౌతానయ్యా!'

కదలలేని ఆమెస్థితి-నన్ను కదిలించింది.

ఆమెమాట కాదనలేక-నేనూ- నా అసిస్టెంట్ పక్కన పొదలో దాకొన్నాము.

నలుగురు కొండజాతివాళ్ళొచ్చారు.

'లచ్చీ! యేటిజరిగినాదే సెప్పవే'— ఒకడు ఆమెదగ్గరికెళ్ళి- 'ఇదేటి' గద్దించినాడు.

'ఏటి' ఇంకొకడు.

'ఇదేదో మందు.'

'ఏంమందు.'

'లచ్చి! నిజంసెప్పు. ఎవడిచ్చాడు నీకీమందు. సెప్పే తప్పుడుదానా'

'మాఁవా!'

'ఛఛ! నీవు మైలషడిందానివి. అట్టా నన్ను పిలవకు.'

'ఒరేయ్! ఈరిగ! ఈ లచ్చి ఏదో సేసింది. రారా! గూడెందొరకు సెప్పి దీన్సంగతి తేల్చేద్దామ్.'

ఇద్దరు ముందుకెళ్లారు.

ఇద్దరు లక్ష్మిని త్రోసుకొంటూ వెళ్లారు.

నేనూ-నా అసిస్టెంట్ ఒకరిముఖాలొకరు చూచుకొన్నాము.

'లక్ష్మిని వారేంచేస్తారో! ఛ!గ్లూకోజ్ ఇచ్చిన నేను-ఆ ప్యాకెట్ ను అక్కడే మరచిపోవాలా. ఆ వెధవమనసు లేం చేస్తారో'—

అసిస్టెంట్ మాటలకు నేను మూగవాన్నైనాను.

ఏదో ఆవేశం నాలో వచ్చింది.

లక్ష్మిని ఎలాగైనాసరే-వారి శిక్షనుండి తప్పించాలని - గూడెం గుడిసెలవైపు దారితీసాను.

'సార్! ప్రమాదంసార్' అసిస్టెంట్ రైఫిలిచ్చి-నిలబడిపోయాడు.

'సరే! నివ్విక్కడే ఉండు.' నేను ముందుకు కదిలాను.

'నీళ్ళు తేడానికని వెళ్లానయ్యా! కడుపులో ఉన్నపళాన ఏదో తిప్పినట్లై కళ్ళుతిరిగి పడిపోయినానయ్యా కళ్ళు విప్పేసరికి ఇద్దరు బస్త్రీవోళ్ళు ఆపొట్లం లోనిదేదో నాకు తాగించినారయ్యా.'

లక్ష్మి చెప్తోంది. నేను వింటున్నాను, పొదచాటునుండి.

'నేను వాళ్ళని వెళ్ళిపొండని చెప్తా ఉంటే అంతలో రంగన్నమాఁవా వాళ్ళు వొచ్చిసినారు.'

మాఁవా! అంటే వాడు మొగుడు కాదేమో - నేననుకొన్నాను. ఎందుకంటే ఒక్కొక్క కొండజాతివాళ్ళు భర్తలను ఒక్కొక్క రకంగా పిలుస్తుంటారు. కోయదొర గంభీరంగా అంటున్నాడు.

'లచ్చి చెప్పేది నిజమైతే-ఆమె గూడెం దేవతసూపుల్లోమైలపడినట్లేఆమెను మళ్లీ మనలో చేర్చుకోవాలంటే-ఆమె పవిత్రం కావాల. దానికి-ఆ దేవత దగ్గరుంచిన గన్నేరుకాయల విషం ఆమె కివ్వండి. బ్రతికొచ్చినదా సరే. లేక సచ్చినదా మైలపడిందానికి పీడపోతుంది.'

నాలో అసహనం పెరిగిపోయింది.

లక్ష్మి ముభావంగా ఉంది. ఇద్దరు స్థూలకాయులు లక్ష్మికి విషంపాత్ర ఇచ్చారు. లక్ష్మి తాగబోతోంది—

రైఫిల్ గాలిలో పేల్చాను. అప్పటికే సగంమంది పారిపోయారు.

'లక్ష్మీ! ఆ విషం తాగొద్దు. చచ్చిపోతావ్' - ముందుకొచ్చాన్నేను.

'ఒక బాణం రివ్వున నా ఎడమచేతికి గాయం చేసింది. ఏమాత్రం ఆలస్యం చేసినా నా ప్రాణాలు పోతాయి. కాని-నాక్కావలసింది లక్ష్మి ప్రాణం నిలబడడం. అందుకే—

రైఫిల్ పేల్చాను.

ఒక కొండజాతివాడి కాలులో బులెట్ దూసుకుపోయింది. చాలమంది పారిపోయారు. గూడెందొర ఉన్నాడు.

'దొరా! నువ్వు చేస్తున్నది అన్యాయం! విషమివ్వడం నేరం. విషాన్ని త్రాగడం నేరం. ఈ రెండింటిని చూడడంకూడా నేరమే. అందుకే అడ్డమొచ్చాను. నా మాటనమ్మండి. మీకు మేలుచేస్తాను-'

అంతలో నాపై ఈటె విసిరివేయబడింది.

నేను రైఫిల్ ట్రిగ్గర్ నొక్కబోయాను.

'అయ్యా! వద్దయ్యా! వారినొగ్గెయ్!'- లక్ష్మి ఖాళీ విషంపాత్రను క్రిందపెట్టూ అంది.

గూడెందొర పారిపోయాడు.

నేను స్థాణువులా నిలబడిపోయాను. వెంటనే తేరుకొని లక్ష్మిని రెండుచేతులా ఎత్తుకొని వ్యాన్‌దగ్గరి కొచ్చాను.

'డ్రైవర్!' అరచినంత పనిచేసాను.

మత్తుగా ఉన్న డ్రైవర్ తాటికల్లు మైకంలో కదలలేక రోడ్డుమీదున్నాడు. నేనే వ్యానెక్కి డ్రైవ్‌చెయ్యసాగాను.

వ్యాన్ వేగం పెరిగింది.

నా హృద్వేగం పెరిగింది, కాని—

లక్ష్మి చూపు నిలిచింది.

ఆమె మాట నిలిచింది.

ఊపిరి ఉస్సూరుమంది.

ఉర్వికొక భారం తీరిపోయింది.

'లక్ష్మీ!'-అడవిమార్గ మధ్యంలోనే-లక్ష్మిహంస ఎగిరిపోయింది. చేసేదేమీ లేక వెనుదిరిగి గూడెందగ్గర లక్ష్మి శవాన్ని విడిచాను. కనులనుండి నీరు-గుండెలనుండి నెత్తురు పొంగుతున్నాయి

నా అసిస్టెంట్ ఆ శవంపై దుప్పటి కప్పాడు. కైపెక్కిన డ్రైవర్‌ను — వ్యాన్‌లో పడేసి నేనూ, నా అసిస్టెంట్ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లాము. అప్పుడు సమయం రాత్రి కావస్తోంది.

* * *

నే చూసిన ఘోరాన్ని ప్రభుత్వానికి చెప్పవలసిన బాధ్యత నాకుంది. అందుకే చెప్పబోయాను. కాని—

లక్ష్మి మాటలు గుర్తుకొస్తున్నాయి. చెప్పలేకపోతున్నాను.


సతమతమయ్యాను. చివరకు సమాధానపడ్డాను.

'అన్యాయాన్ని చెయ్యకూడదు. చెయ్యనివ్వకూడదు. చేపించకూడదు. అన్యాయం జరుగుతుంటే ఆపాలి. లేదా ప్రభుత్వానికైనా తెలపాలి లేదా ప్రభుత్వంతోపాటు - తానూ నిలిచి పోరాడాలి. జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వానికి చెప్పకపోవడం నేరమే. అందుకే—

'లక్ష్మీ! నన్ను క్షమించు'-అనుకొన్నాను.


చీఫ్ ఎక్సిక్యూటివ్‌కు ఈ విషయాన్ని చెబుదామనుకొన్నాను. టైమ్ తొమ్మిది దాటింది. రాత్రిసమయమైనా ఇప్పుడే చెప్పెయ్యాలి. అందుకే ఎక్జిక్యూటివ్ గదిలోకి వెళ్లాలని డోర్‌దగ్గిరి కొచ్చాను.

"వెరీగుడ్ డేవిడ్! ఈ కోయపిల్ల చాల బాగుందోయ్! మీ తెలివితక్కువ వల్ల లక్ష్మి చనిపోయింది. ప్చ్, ఆమె



నలాగే తీసుకొని రావలసింది. గ్లూకోజ్ నీరెవరిమ్మన్నారు. అనెస్థిటిక్సిచ్చి — మత్తులోముంచి-ఇక్కడకు తీసికొనివచ్చి ఉంటే—ఎంతో మజాగా ఉండేది. ఈ నైటంతా జాలీగా ఉండేది. ఆల్‌రైట్! లక్ష్మి పోతేపోయింది. ఈ చుక్కనైనా తీసికొని వచ్చావ్ కదా! ఇదీ అందంగానే ఉంది. కైపెక్కిస్తోంది. ఐనా, ఈ కొండజాతోళ్లెందుకింత అందంగా ఉంటారో! చుక్కని పిల్చుకొని వచ్చేటప్పుడు—ఆ రవీంద్ర నిన్ను చూడలేదా," -చీఫ్ ఎక్స్‌క్యూటివ్ మాటలవి.

'రవీంద్ర చూచేలా నేనెందుకు తెస్తాను సార్. వాడొక వాజమ్మ. వాడు సుఖపడడు. మమ్మల్ని సుఖపడవద్దంటే ఎలాగా. మీరు కానివ్వండి సార్'- తన అసిస్టెంట్ డేవిడ్ మాటలవి.




'ఓ! ఆల్‌రైట్! సీయూ ఎగైన్!' 'ఓ స్వీట్ గర్ల్'- ఎక్సిక్యూటివ్ ప్రేలాపన. 'ఓకే! గుడ్‌నైట్ సర్'-డేవిడ్ తలుపు తెరచుకొని వచ్చి—

నన్ను చూచాడు- చూచి-

'సర్ ....మీరా'

'యస్. మిస్టర్ రవీంద్ర, డేవిడ్ గారు'-అంతే.

అక్కడొక క్షణంకూడా ఉండలేదు. వెనుదిరిగాను.

'కంచె చేను మేస్తే - చేనుకు దిక్కెవ్వరు. చట్టమే పీక్కుతింటే ప్రజలకు గతెవ్వరు. గిరిజనాభ్యుదయాధికారి దయమాలి - విధిని మరచి-స్వార్థభూతాలను పాలుపోసి పెంచి—గిరికన్యల బ్రతుకులను నాశనం చేయడమా? అమాయక గిరిజనులను పెడతోవ పట్టించడమా? ఇదేనా ప్రభుత్వ—కర్తవ్యం'—నాలో ఆలోచన మేల్కొంది.

'ప్రభుత్వమనేది వేరేకాదు. మేమే. మాలోని మంచి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పరస్తుంది. అదే చెడుఅయితే ప్రజా కంటకమౌతుంది. అందుకే మంచిని పెంచడం - మంచిని వినడం—మంచిని చెయ్యడం - మంచిని చెప్పడం-ప్రతి మనిషీ చేయాలి. కనిపించిన చెడు పామును చంపేయాలి. ప్రతి పౌరుడూ 'ప్రజాకూటమి'గా రూపొందితే-సాధించలేంది లేదు. అందుకే ప్రజలలో చైతన్యం రావాలి. దానికి ఊపిరిఇవ్వాలి. వారిలో ప్రబోధాత్మక పరిశీలనావగహనను కలుగజేసి-సుస్థిరమైన సుఖరాజ్యాన్ని సాధించుకోవాలి' — అందుకే.

"ఓ హృదయమా! మేలుకో!"— నాలో చలనం పెరిగింది.